నిజమే మా బలం.. ప్రజలే మా బలగం

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ మంగళవారం 06 ఆగస్టు 2024 | www.balagamtv.com | పేజీలు 4


## యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ చైర్మెన్‌గా ఆనంద్ మహీంద్రా



- అమెరికాలో ప్రవాసుల సభలో ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- 17 కోర్సులను ఆఫర్ చేయనున్న స్కిల్ యూనివర్సిటీ

వివరాలు 3వ పేజీలో

# ఫిల్మ్‌ఫేర్ అవార్డుల వేడుక

**బలగం టీవీ, హైదరాబాద్**

హైదరాబాద్‌లోని జేఆర్సీ కన్వెన్షన్ వేదికగా 69వ శోభ ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్ సౌత్ –2024 కార్యక్రమం సందడిగా జరిగింది. హీరోలు, హీరోయిన్ల సమక్షంలో విజేతలను ప్రకటించారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ సినిమా ఇండస్ట్రీలకు చెందిన నటీనటులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పెద్దగా అంచనాలు లేకుండా చిన్న సినిమాగా విడుదలై అందరి ప్రశంసలు అందుకున్న 'బలగం' సినిమా ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్‌లో ఉత్తమ చిత్రంగా నిలిచింది. ఈ సినిమాకు దర్శకత్వం వహించిన వేణు ఉత్తమ దర్శకుడిగా ఎంపికయ్యాడు. అంచనాలు అందుకోలేకపోయిన 'దసరా' సినిమాలో అద్భుతంగా నటించిన నేచురల్ స్టార్ నాని ఉత్తమ నటుడిగా, కీర్తి సురేశ్ ఉత్తమ నటిగా ఎంపికయ్యారు.

**విజేతల పూర్తి జాబితా ఇదే..**

1. ఉత్తమ సినిమా – బలగం
2. ఉత్తమ డైరెక్టర్ – వేణు యెల్దండి (బలగం)
3. ఉత్తమ సినిమా (క్రిటిక్స్) –సాయి రాజేష్ (బేబీ)
4. ఉత్తమ నటుడు (ప్రధాన పాత్ర) – నాని (దసరా)
5. ఉత్తమ నటుడు (క్రిటిక్స్) – ప్రకాశ్ రాజ్ (రంగ మార్తాండ), నవీన్ పోలిశెట్టి (మిస్ శెట్టి, మిస్టర్ పోలిశెట్టి)
6. ఉత్తమ నటి (ప్రధాన పాత్ర) – కీర్తి సురేశ్ (దసరా)
7. ఉత్తమ నటి (క్రిటిక్స్)– వైష్ణవి చైతన్య (బేబీ)
8. ఉత్తమ సహాయ నటుడు (మేల్) – బ్రహ్మానందం (రంగ మార్తాండ), రవి తేజ (వాల్తేరు వీరయ్య)
9. ఉత్తమ సహాయ నటి – రూపా లక్ష్మి (బలగం)
10. బెస్ట్ మ్యూజిక్ ఆల్బమ్ – బేబీ (విజయ్ బుల్గానిన్)
11. ఉత్తమ లిరిక్స్ – అనంత శ్రీరామ్ (ఓ రెండు ప్రేమ మేఘాలిలా– బేబీ)
12. ఉత్తమ నేపథ్య గాయకుడు – శ్రీరామ చంద్ర (ఓ రెండు ప్రేమ మేఘాలిలా– బేబీ)
13. ఉత్తమ నేపథ్య గాయని – శ్వేతా మోహన్ (మాస్టారు మాస్టారు – సర్)
14. ఉత్తమ సినిమాటోగ్రఫీ– సత్యన్ సూర్యన్ (దసరా)
15. ఉత్తమ కొరియోగ్రఫీ– ప్రేమ్ రక్షిత్ (ధూమ్ ధామ్ దోస్తాన్– దసరా)
16. బెస్ట్ ప్రొడక్షన్ డిజైన్ – కొల్లా అవినాశ్ (దసరా)
16. ఉత్తమ పరిచయ దర్శకుడు (డెబ్యూ) – శ్రీకాంత్ ఓదెల (దసరా), శౌర్యవ్ (హాయ్ నాన్న).
17. ఉత్తమ పరిచయ నటుడు – సంగీత్ శోభన్ (మ్యాడ్)

# బలగం తీన్మార్

- ఫిలింఫేర్ అవార్డుల్లో బలగంకు మూడు అవార్డులు
- ఉత్తమ చిత్రం'బలగం'
- ఉత్తమ దర్శకుడు 'వేణు యెల్దండి'
- ఉత్తమ సహాయ నటిగా రూపలక్ష్మి అవార్డు
- వేణు బలగం కు కేటీఆర్ మొదటి నుంచి అండ
- బలగం సినిమా మొత్తం సిరిసిల్ల జిల్లాలోనే షూటింగ్
- సిని చరిత్రలోనే మైలురాయి గా 'బలగం'
- సిరిసిల్ల లో మొట్టమొదటి సినిమా ప్రీ రీలిజ్ ఈవెంట్ కూడా బలగం సినిమా
- సిరిసిల్ల నేత కార్మిక కుటుంబంలో పుట్టి.. సినీరంగంలో రాణిస్తున్న వేణు యెల్దండి
- బలగం సినిమాతో వేణు యెల్దండికి ఎలేని పేరు ప్రఖ్యాతులు
- ఫిలింఫేర్ అవార్డులతో మరోసారి తెరపైకి బలగం సినిమా చర్చ





**బలగం టీవీ, హైదరాబాద్**

బలగం సినిమా.. సిని ప్రపంచంతో ఎంత పెద్ద హిట్ కొట్టిందో అందరికి తెలుసు. దిల్ రాజు ప్రొడక్షన్ లో వేణు యల్దండి తొలిసారి దర్శకత్వం వహించిన సినిమా ఈ బలగం సినిమా. తెలంగాణ కల్చర్ పై, పిట్ట ముట్టుడు పై తీసిని ఈ సినిమా కొట్లాది మంది తెలుగు ప్రేక్షకుల మనస్సులను దొచింది. చిన్న బడ్జెట్ తో తీసిన ఈ సినిమా రూ.40 కోట్లకు పైగా వసూళ్లు చేసి రికార్డు సృష్టించగా.. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి గ్రామంలో బారి స్క్రీన్లు పెట్టి బలగం సినిమాను ప్రదర్శించారు. గ్రామ చావడి వద్ద గ్రామస్తులంతా కలిసి కొన్ని ఎండ్ల


మిగితా 3వ పేజీలో

# అట్టుడుకుతున్న బంగ్లాదేశ్



- దేశంలో ఆగని నిరసనలు
- ప్రధాని హసీనా రాజీనామా
- దేశంలో సైనిక పాలన





**బలగం టీవీ, ఢాకా**

బంగ్లాదేశ్‌లో పరిస్థితి అదుపుతప్పింది. ఉద్యోగాల్లో రిజర్వేషన్ల విధానాన్ని వ్యతిరేకిస్తూ చెలరేగిన హింస తీవ్రరూపం దాల్చింది. వేలాది మంది నిరసనకారులు దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతున్నారు. కొన్ని చోట్ల హింసాత్మక ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఆందోళనకారులు ఆయుధాలను చేతపట్టి వాహనాలు, దుకాణాలు, కార్యాలయాలను ధ్వంసం, దగ్ధం చేస్తున్నారు. పోలీస్ స్టేషన్లపై అధికార పార్టీ నేతల నివాసాలు, కార్యాలయాలపై కూడా దాడులకు తెగబడుతున్నారు. సోమవారం వేలాది మంది నిరసనకారులు రాజధాని ఢాకాలో విధ్వంసం సృష్టించారు. జాతిపిత షేక్ ముజిబుర్ విగ్రహాన్ని ధ్వసం చేశారు. ఇక ఢాకాలోని పీఎం అధికారిక నివాసం గణభబన్‌ను ముట్టడిం చారు. కొందరు నిరసనకారులు పీఎం నివాసంలోకి చొచ్చుకెళ్లారు. దీంతో బంగ్లా ప్రధాని షేక్ హసీనా , ఆమె సోదరి షేక్ రెహానా బంగ్లాను వీడి సురక్షిత ప్రాంతానికి తరలివెళ్లినట్లు తెలుస్తోంది. మరోవైపు ఈ అల్లర్లలో ఇప్పటి వరకూ 300 మందికిపైగా మృతి చెందినట్లు స్థానిక మీడియా నివేదించింది.

**దేశంలో సైనిక పాలన**

తాజా హింస నేపథ్యంలో ఆర్మీహెచ్చరికలతో ప్రధాని పదవికి హసీనా రాజీనామా చేసినట్టు స్థానిక మీడియా పేర్కొంది. అనంతరం సోదరితో కలిసి ఢాకా ప్యాలెస్ నుంచి ఆర్మీ హెలికాప్టర్‌లో బంగ్లా మీదుగా భారత్‌కు తరలివెళ్లినట్లు వెల్లడిం చింది.ఆందోళనకారులు బంగ్లాదేశ్ ప్రధాని కార్యాలయాన్ని చుట్టుముట్టడంతో షేక్ హసీనా భారత్‌కు బయలుదేరినట్లు సమాచారం. ఢాకా ప్యాలెస్ నుంచి హసీనా ఆర్మీ హెలికాప్టర్‌లో భారత్ బయలుదేరినట్లు సమాచారం.

ప్రస్తుతం బంగ్లాలో కర్ఫ్యూ కొనసాగుతోంది. తాజా పరిస్థితుల నేపథ్యంలో దేశంలో ప్రభుత్వ ఏర్పాటుకు సైన్యం సిద్ధమైంది. లా అండ్ ఆర్డర్ మొత్తం సైన్యం చేతుల్లోకి వెళ్లిపోయింది. త్వరలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామన్న ఆర్మీ చీఫ్ ప్రకటించారు. మరోవైపు దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున సైన్యం మొహరించింది.

## సీఐతో పాటు ఐదుగురు కానిస్టేబుళ్ల సస్పెన్షన్




**బలగం టీవీ, హైదరాబాద్**

: రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో దొంగతనం కేసులో మహళ, ఆమె భర్త, కుమారుడిని ఠాణాకు తీసుకొచ్చి చిత్రహింసలకు గురి చేసిన ఘటనలో పోలీస్ ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. దీనికి బాధ్యుడైన డిటెక్టివ్ సీఐ రామిరెడ్డితో పాటు మరో ఐదుగురు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేస్తూ సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి ఉత్తర్వులు జారీ చేశారు. షాద్‌నగర్ ఠాణాలో పని చేస్తున్న కానిస్టేబుళ్లు జాకీర్, రాజు, మోహన్ లాల్, అఖిల, కరుణాకర్‌లను సీపీ సస్పెండ్ చేశారు. దీంతో పాటు ఘటనపై తదుపరి విచారణ కొనసాగిస్తున్నట్లు అవినాశ్ మహంతి తెలిపారు.

రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలోని అంబేడ్కర్ నగర్‌కు చెందిన దళిత మహిళను పోలీసులు ఠాణాలో చిత్రహింసలకు గురి చేసిన వ్యవహారం తీవ్ర దుమారం రేపుతోంది. దళితవాడలో నివాసముండే పీఎంపీ వైద్యుడు నాగేందర్ జులై 24న తన ఇంట్లో 22.5 తులాల బంగారం, రూ.2 లక్షలు పోయాయని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నాగేందర్ ఇంటికెదురుగా ఉంటూ కూలీ చేసుకునే భీమయ్య, సునీత దంపతుల్ని జులై 26న డిటెక్టివ్ సీఐ రామిరెడ్డి విచారణ కోసమని స్టేషన్ పిలిచారు. చోరీ చేయలేదని చెప్పడంతో వదిలేశారు.

అయితే మళ్లీ 30న రాత్రి 9 గంటలకు సునీతను ఠాణాకు తీసుకెళ్లిన పోలీసులు నేరం అంగీకరించాలని చిత్రహింసలకు గురి చేశారని చెబుతోంది. ఒప్పుకోకపోవడంతో తన 13 ఏళ్ల కుమారుడి కళ్ల ముందే విచక్షణా రహితంగా కొట్టినట్లు తెలుస్తోంది. దెబ్బలు తాళలేక బాధితురాలు స్పృహ తప్పి పడిపోవడంతో ఫిర్యాదుదారు వాహనంలోనే ఇంటికి పంపారని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది. పోలీసుల తీరుపై పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో ఉన్నతాధికారులు స్పందించి, బాధ్యులపై చర్యలు తీసుకున్నారు.

దళిత మహిళపై పోలీసుల దాడి ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సమగ్ర విచారణకు ఆదేశించిన సీఎం, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బాధితులు ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా ఘటనపై విచారణ చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. షాద్‌నగర్ డిటెక్టివ్ ఇన్?స్పెక్టర్‌ను ఇప్పటికే కమిషనరేట్ ప్రధాన కార్యాలయానికి బదిలీ చేసిన సీపీ అవినాశ్ మహంతి, తాజాగా ఆయనతో పాటు మరో ఐదుగురు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

# నాగార్జునసాగర్ 16 గేట్లు ఎత్తి నీరు విడుదల



**బలగం టీవీ, హైదరాబాద్**

శ్రీశైలం నుంచి వరద ప్రవాహం పోటెత్తడంతో నిండుకుండలా మారిన సాగర్ డ్యామ్ నీటిని, ఇవాళ ఉదయం అధికారులు తొలుత ఆరు గేట్లను ఎత్తి దిగువకు వదిలారు. క్రమక్రమంగా గేట్ల సంఖ్యను పెంచుతూ వెళ్లారు. సాయంత్రం అయ్యేసరికి మొత్తం 16 గేట్లు ఎత్తి నీటిని దిగువకు రిలీజ్? చేశారు.

ముందుగా

మిగితా 3వ పేజీలో



## హైదరాబాద్‌లో కాగ్నిజెంట్ భారీ విస్తరణ..

- న్యూజెర్సీ కార్యాలయంలో సీఈవోతో సీఎం రేవంత్ భేటీ
- తెలంగాణ స్టార్టప్‌లలో వాల్స్ కర్రా రూ.839 కోట్ల పెట్టుబడులు
- సీఎం సమక్షంలో ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్న సంస్థ
- మరో 15 వేల మందికి ఉద్యోగ అవకాశాలు

వివరాలు 3వ పేజీలో

## పార్టీ మారిన ఎమ్మెల్యేల పైన అనర్హత వేటు తప్పదు



- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**బలగం టీవీ, హైదరాబాద్**

పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత విషయంలో న్యాయపరమైన చర్యలు తీసుకునేందుకు బీఆర్ఎస్ ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఈ మేరకు ఢిల్లీలోని పలువురు ప్రముఖ న్యాయ కోవిదులతో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో సీనియర్ నాయకుల బృందం

వివరాలు 3వ పేజీలో

# వారంలో రెండు రోజులు డ్రై డే పాటించాలి




- పారిశుధ్య నిర్వహణ,పచ్చదనం పెంపు లక్ష్యాలుగా స్వచ్ఛదనం-పచ్చదనం..
- స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమాన్ని పక్కా కార్యాచరణతో నిర్వహించాలి
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**బలగం టీవీ ,ముస్తాబాద్**

నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమాలను ప్రతి రోజు పక్కాగా నిర్వహించి రాష్ట్రంలోనే మన జిల్లా ప్రథమ స్థానంలో ఉండే విధంగా కృషి చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. సోమవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పచ్చదనం.. స్వచ్ఛదనం కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు ముస్తాబాద్ మండల కేంద్రంలో కార్యక్రమాన్ని చేపట్టగా, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హాజరయ్యారు.

అనంతరం ముస్తాబాద్ కొత్త బస్టాండ్ నుంచి గ్రామ పంచాయతీ కార్యాలయం దాకా చేపట్టిన ర్యాలీ లో, డీపీఓ వీర బుచ్చయ్య, మహిళా సంఘాల బాధ్యులు, విద్యార్థులు లతో కలసి కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పాల్గొన్నారు. స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమం క్రింద ఆగస్టు 5 నుంచి 9 వరకు చేపట్టాల్సిన కార్యక్రమాల వివరాలను జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య వివరించారు. పలువురు రైతులకు సేంద్రియ ఎరువుల పంపిణీ చేసి అనంతరం ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించేందుకు రూపొందించిన పోస్టర్ ను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణ పచ్ఛధనం పెంపు లక్ష్యాలతో ప్రభుత్వం ఆగస్టు 5 నుంచి 9 వరకు స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాన్ని అమలు చేస్తుందని, దీంతో ప్రతి ఇల్లు, గ్రామం, పట్టణం స్వచ్ఛంగా,పచ్చగా ఉండాలని అన్నారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు వారం లో రెండు రోజులు డ్రై డే గా పాటించాలని, ఇంట్లోని పాత టైర్లు, కొబ్బరి చిప్పలు, ప్లాస్టిక్ వస్తువుల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించాలని, ఇల్లు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు.స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమం ద్వారా మన ఇంటిని ఎలా శుభ్రంగా ఉంచుతామో అదే విధంగా మన గ్రామాన్ని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని,ప్రజలు పెద్ద ఎత్తున స్వచ్ఛందంగా ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రభుత్వ లక్ష్యాన్ని సాధించాలని అన్నారు.

డెంగ్యూ వ్యాధి నియంత్రణలో జిల్లా పనితీరు మెరుగ్గా ఉందని, భవిష్యత్తు లోనూ ఇదే స్ఫూర్తి కొనసాగించాలని అన్నారు. అవెన్యూ ప్లాంటేషన్ కింద ఎత్తైన మొక్కలు మన నర్సరీల వద్ద అందుబాటులో ఉన్నాయని,విద్యుత్ లైన్లు, త్రాగునీటి సరఫరా పైప్ లైన్లకు దూరంగా అవెన్యూ ప్లాంటేషన్ మొక్కలు నాటాలని అన్నారు. ముస్తాబాద్ తహసిల్దార్ కార్యాలయ తరలింపు కోసం ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రత్యామ్నాయ ప్రభుత్వ భూమి అందుబాటులో ఉంటే ఎస్సీ కాలనీ లోని డంపింగ్ యార్డ్ తరలింపు సాధ్యా సాధ్యలపై నివేదికను వారం రోజుల్లో సమర్పించాలని జిల్లా పంచాయతీ అధికారిని సూచించారు.

డ్రైనేజీ వాటర్ మానేరు నదిలో కల్వకుండా కమ్యూనిటి సోప్ కిట్ నిర్మించాలని, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు అవసరమైన భూమి గుర్తించి ప్రభుత్వానికి నివేదిక పంపుతామని అన్నారు. స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో మంచి ఫలితాలు సాధించాలని, నర్సరీ లో మంచి మొక్కలు అందుబాటులో ఉన్నాయని, అవసరమైన మేర గ్రామంలో పచ్చదనం పెంచేందుకు ప్రణాళిక రూపొందించాలని అన్నారు. స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, చిన్నతనం నుంచే పారిశుధ్య నిర్వహణ పట్ల పిల్లలకు అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

అనంతరం కే కే మహేందర్ మాట్లాడుతూ అడవుల విస్తీర్ణం తగ్గిపోవడం, చెట్లు లేకపోవడం వల్ల గ్రామంలో కోతుల సమస్యలు కూడా పెరుగుతున్నాయని అన్నారు. స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమం ద్వారా ఆరోగ్య తెలంగాణ సాధ్యమవుతుందని ఆ దిశగా మనమంతా కృషి చేయాలని అన్నారు. సిరిసిల్ల ప్రాంతంలో వర్షాభావ పరిస్థితుల వల్ల నేటి సమస్య ఉండేదని, గతంలో దీని నియంత్రించేందుకు నిజాం ప్రభుత్వం అపర్ మానేర్ ప్రాజెక్టు నిర్మించిందని, మనం వీలైనంత ఎక్కువ చెట్లు నాటడం వల్ల మనకు అంత మంచి జరుగుతుందని అన్నారు.

అనంతరం ఎగువ మానేరు నుంచి ముస్తాబాద్ మండలానికి వచ్చే కాలువ లో మురుగు నీరు కలుస్తున్న ప్రదేశాన్ని పరిశీలించి, నీరు దానిలో కలువకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అక్కడి నుంచి రైతు వేదిక వద్ద తహసిల్దార్ కార్యాలయానికి సంబంధించి నిర్మాణాన్ని పరిశీలించారు.

**మొక్కలు నాటిన కలెక్టర్..**

స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమం అనంతరం ముస్తాబాద్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మొక్కలు నాటారు. పాఠశాల తరగతులు కొనసాగుతుండగా పరిశీలించారు. అదే ఆవరణలోని బాలుర ఉన్నత పాఠశాలను పరిశీలించి ఎంత మంది విద్యార్థులు చదువుతున్నారని, ఎన్ని తరగతి గదులు ఉన్నాయో అడుగగా, మొత్తం 16 తరగతి గదులు, 120 మంది విద్యార్థులు చదువుతున్నారని అధికారులు తెలిపారు. ఈ రెండు స్కూల్స్ లో కావాల్సిన వసతులపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తరగతి గదులు పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. అక్కడి నుంచి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని పరిశీలించగా, స్కూల్ ఆవరణలో నీరు నిలువకుండా కచ్చా కలువ నిర్మించాలని, ఆవరణ శుభ్రం చేసి మొక్కలు నాటించాలని డీఆర్డీఓ శేషాద్రిని కలెక్టర్ ఆదేశించారు. తరగతి గదులు పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం డైనింగ్ హాల్ లో సిద్ధంగా ఉన్నా ఆహార పదార్థాలు పరిశీలించారు. మెనూ ప్రకారం అందుస్తున్నరా అని విద్యాలయం బాధ్యలను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ డీఈఓ రమేష్ కుమార్, జిల్లా ఉద్యానవన అధికారి, మండల ప్రత్యేక అధికారి లత, సెస్ డైరెక్టర్ అంజి రెడ్డి, తహసిల్దార్ సురేష్, ఎంపీడీఓ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



ఆధ్యాత్మికత ఉట్టిపడేలా

# రాజన్న ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం



- రాజన్న భక్తులకు ఎలాంటి ఇబ్బందు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తాం..
- తిరుపతి, యాదాద్రి తరహాలో రాజన్న ఆలయంలో బ్రేక్ దర్శనం..
- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

**బలగం టీవీ , వేములవాడ :**

రాజన్న భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే అది శ్రీనివాస్ అన్నారు.సోమవారం వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో బ్రేక్ దర్శనాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దేవాదయ శాఖ వారి ఆధ్వర్యంలో దక్షిణ కాశీగా పేరుగాంచి, భక్తుల కోరికలు తీర్చే రాజన్న ఆలయంలో బ్రేక్ దర్శనం ప్రారంభించడం శుభ పరిణామం అని అన్నారు. యాదాద్రి,తిరుమల తిరుపతి దేవస్థాన తరహాలో వేములవాడ రాజన్న ఆలయంలో కూడా శీఘ్రదర్శనాన్ని లభించేలా బ్రేక్ దర్శనం ఏర్పాటు చేసుకున్నామని అన్నారు.

ప్రతిరోజు ఉదయం 10:15 నుంచి 11:15 వరకు సాయంత్రం నాలుగు 4:00 నుంచి 5:00 నిమిషాల వరకు బ్రేక్ దర్శనం ఏర్పాట్లుచేస్తున్నామని,ప్రతి ఒక్కరికి 300 రూపాయల టికెట్,కోడే టికెట్తో 500 రూపాయలు లకే బ్రేక్ దర్శనం భక్తులకు కల్పిస్తున్ననట్టు తెలిపారు.

దేశంలోనే ఎక్కడ లేని విధంగా ఆ పరమేశ్వరునికి కోడేని కట్టడం వేములవాడ రాజన్న ఆలయ ప్రసిద్ధిగాంచింది అని అన్నారు.బ్రేక్ దర్శనం పట్ల చతిస్గడ్, మహారాష్ట్ర నుంచి వచ్చిన భక్తులు చాలా ఆనంద వ్యక్తం చేస్తున్నారని అన్నారు.శ్రావణమాసం మొదటిరోజు న బ్రేక్ దర్శనం ప్రారంభించుకోవడం చాలా శుభ పరిణామం అని అన్నారు. రాజన్న ఆలయానికి గత పాలకులు 100 కోట్లు ఇస్తాం అని మోసం చేశారని,వాళ్ల రంగురంగుల బ్రోచర్లలో అభివృద్ధి చేశారు తప్ప, క్షేత్రస్థాయిలో ఎక్కడ కూడా అభివృద్ధి చేయలేదని అన్నారు.

ప్రభుత్వ ఏర్పడిన మొదటి మూడు నెలల్లోనే విటీడీఏ సమావేశం ఏర్పాటు చేసి,వెనకకి వెళ్ళిపోయినా 20 కోట్ల నిధులను వెనక్కి తీసుకువచ్చామని, బడ్జెట్లో ఎవరు ఊహించని విధంగా రాజన్న ఆలయానికి 50 కోట్ల నిధులు కేటాయించడం జరిగింది అని,ఈ నిధులతో ఆలయాన్ని అభివృద్ధి పరుస్తూ భక్తులకు ఒక చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడేలా అన్ని సౌకర్యాలు కల్పిస్తాం అని అన్నారు.కేసీఆర్ రాజన్న ఆలయానికి 100 కోట్లు ఇస్తామని మోసం చేశారని,ప్రతి బడ్జెట్లో రాజన్న ఆలయానికి నిధులు కేటాయిస్తారని కండ్లు కాయల కాచేలా ఎదురు చూశాం అని అన్నారు.

మేము ఎక్కడ కూడా బడ్జెట్లో నిధులు కేటాయిస్తామని చెప్పలేదు కానీ,ఈ బడ్జెట్లో 50 కోట్లు రాజన్న ఆలయానికి కేటాయించాం అది మాకు దేవాలయం పై ఉన్న చిత్తశుద్ధి అని అన్నారు.గత ప్రభుత్వంలో రాజన్న ఆలయానికి నిధులు కేటాయించకపోగా,దేవాలయం నుండి ఆరు కోట్ల నిధులను ఇతర దేవాలయాలకు మళ్లించారు అని అన్నారు.రాబోవు రోజుల్లో మరిన్ని నిధులు తీసుకువచ్చి ఆలయాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తామని,త్వరలోనే దేవాదాయ శాఖ అధికారులు రాజన్న ఆలయానికి రావడం జరుగుతుంది అని, వారి అంచనాలకు అనుగుణంగా ఆలయ విస్తీర్ణం చేపడతామని అన్నారు.ఇటీవల శృంగేరి పీఠానికి వెళ్లిన సందర్భంలో వేములవాడ రాజన్న ఆలయం అభివృద్ధి విస్తరణ పై వారికి తెలియజేయడం జరిగింది అని,వారి సూచన మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దేవాదాయ మంత్రి సహకారంతో అభివృద్ధి చేస్తామని అన్నారు.ఆగమ శాస్త్రం ప్రకారం ఆలయ విస్తరణ చేపట్టి,రాజన్న దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని రకాల చర్యలుచేపట్టి,ఆధ్యాత్మిక చింతన ఉలిక్కిపడేలా ఆలయాన్ని అభివృద్ధి చేపడతామని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు,స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



# సత్వర న్యాయం కోసమే గ్రీవెన్స్ డే...



- గ్రీవెన్స్ డే లో 14 ఫిర్యాదులు స్వీకరణ...
- ఎస్పీ అఖిల్ మహాజన్

**బలగం టీవీ ,రాజన్న సిరిసిల్ల :**

ప్రజల వద్ద నుండి పిర్యాదులు స్వీకరించి ప్రతి పిర్యాదుపై స్పందించి బాధితులకు సత్వర న్యాయం అందించే విధంగా ప్రతి సోమవారం గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహిస్తామని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమంలో భాగంగా ప్రజల వద్ద నుండి ఎస్పీ అఖిల్ మహాజన్ ఫిర్యాదుల స్వీకరించారు.ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమావారం గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహిస్తున్నామని,అందులో భాగంగా సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమనికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 14 ఫిర్యాదులు స్వీకరించామని అన్నారు. ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.భూ తగాదాలు,ఆస్థి తగాదాల విషయంలో చట్ట ప్రకారం, నిబంధనలకు అనుగుణంగా నడుచుకుంటూ బాధితులకు సత్వర న్యాయం అందించే విధంగా చూడాలని అన్నారు .గ్రీవెన్స్ డే ఫిర్యాదులు ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందిస్తున్నామన్నారు.


ఫ్రెండ్లీ పోలీసింగ్ నిర్వహిస్తూనే అసాంఘిక శక్తులు, నేరస్థుల పట్ల కఠిన వైఖరి అవలంభిస్తూ శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా చూస్తున్నామని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని తెలిపారు.

## ప్రజావాణి అర్జీలు పెండింగ్‌లో పెట్టవద్దు.

- అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్..

**బలగం టీవీ ,సిరిసిల్ల,**

ప్రజావాణి దరఖాస్తులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ అధికారుల ను ఆదేశించారు. సోమవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ప్రజల నుంచి అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ మాట్లాడుతూ ప్రజావాణి కు వచ్చే దరఖాస్తులు పెండింగ్ లో పెట్టవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారలు,తదితరులు పాల్గొన్నారు.



## కాగ్నిజెంట్ విస్తరణ

**బలగం టీవీ , హైదరాబాద్**

ప్రపంచస్థాయిలో ఐటీ రంగంలో పేరొందిన కాగ్నిజెంట్ కంపెనీ తెలంగాణలో భారీ విస్తరణ ప్రణాళికతో ముందుకు వచ్చింది. హైదరాబాద్ లో దాదాపు 15 వేల మందికి ఉద్యోగాలు కల్పించేలా కొత్త సెంటర్ నెలకొల్పనున్నట్టు ప్రకటించింది. ఇరవై వేలమంది ఉద్యోగులుండేలా పది లక్షల చదరపు అడుగుల స్థలంలో ఈ సెంటర్‌ను స్థాపించనుంది. అమెరికా పర్యటనలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి, ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబు సోమవారం కాగ్నిజెంట్ సీఈవో రవికుమార్‌తోపాటు కంపెనీ ప్రతినిధి బృందంతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జరిగిన చర్చల్లో ఈ ఒప్పందం కుదిరింది. టెక్నాలజీ, ఇన్నోవేషన్ హబ్‌గా సత్తా చాటుకుంటున్న హైదరాబాద్‌లో తమ కంపెనీని విస్తరించడం సంతోషంగా ఉందని కాగ్నిజెంట్ సీఈవో ఎస్ రవికుమార్ తెలిపారు.

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి..



**బలగం టీవీ , సిరిసిల్ల**

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్వో డాక్టర్ వసంత రావు అన్నారు. సోమవారం సిరిసిల్ల పట్టణంలోని జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ కార్యాలయంలో సీజనల్ వ్యాధులపై ల్యాబ్ టెక్నీషియన్స్, మలేరియా ఆరోగ్య కార్యకర్తలు( హెల్త్ అసిస్టెంట్స్ మగ ) లకు అవగాహన సమావేశం నిర్వహించారు. డిఎంహెచ్వో వసంతరావు మాట్లాడుతూ ఇంటి పరుసరాల్లో నీరు నిలువ లేకుండా చూడాలని, లార్వా నిల్వ ఉన్న పాత్రల ను తొలగించాలని అన్నారు. ప్రజలు దోమతెరలు వాడడం, మస్కిటో కాయిల్స్ ఉపయోగించడం వలన దోమలు కుట్టకుండా,జ్వరములు రాకుండా ఉండవచ్చునని అన్నారు. డిప్యూటీ డీఎంహెచ్వో డాక్టర్ రాజగోపాల్ మాట్లాడుతూ లార్వా నిల్వ ఉన్న ప్రాంతాలలో ఆ బె టె తో స్ప్రే, ఐఆర్ఎస్ తో స్ప్రే చేయించడం, ఫాగింగ్ లాంటివి చేయడంతో డెంగ్యూ జ్వరాలను రాకుండా కాపాడుకోవచ్చని అన్నారు ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్వో లింగం, డెమో రాజకుమార్, హెచ్ ఈ బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

# మార్కెట్‌తో పోటీపడి ఉత్పత్తి చేయాలి...



-సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ యధావిధిగా కొనసాగాలిలి

- ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ యధావిధిగా కొనసాగాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. సోమవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో పవర్లూమ్ యజమానులు ఆసాములు, సెస్ అధికారులు, హ్యాండ్లూమ్ అండ్ టెక్స్టైల్స్ అధికారులు కలెక్టర్ సందీప్ కుమార్ ఝాతో కలిసి ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూ సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ మార్కెట్తో పోటీపడి తమ ఉత్పత్తులు చేయాలని,ప్రభుత్వం నుంచి కూడా ఆర్డర్ ఇచ్చేందుకు కృషి చేస్తామని అన్నారు.

సిరిసిల్ల సెస్ కు బకాయి ఉన్న విద్యుత్ సబ్సిడీ బిల్లులు వెంటనే చెల్లించాలని సూచించారు. ఈ కార్యక్రమం లో సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, సెస్ ఎండి రవీందర్ రెడ్డి, హ్యాండ్లూమ్ అండ్ టెక్స్టైల్స్ ఏడీ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# చిన్న,పెద్ద పత్రికల విభజన చెల్లదు




**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

పత్రికల్లో పనిచేసేవారికి అక్రెడిటేషన్ కార్డుల జారీలో పెద్ద పత్రికలు, చిన్న పత్రికల విభజనను హైకోర్టు తప్పుపట్టింది. చిన్న పత్రికలను ఏ, బీ, సీ, డీలుగా విభజించడం చెల్లదని తీర్పిచ్చింది. జీవో 230లో షెడ్యూల్-ఇలోని నిబంధన చెల్లదని పేర్కొంది.రెండు నెలల్లోగా చిన్న పత్రికలకు అక్రెడిటేషన్ ప్రయోజనాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి ఉత్తర్వులు ఇచ్చింది. అక్రెడిటేషన్ కార్డుల జారీకి 2016లో ఇచ్చిన జీవోలోని నిబంధనలు వివక్షపూరితంగా ఉన్నాయని మహబూబ్‌నగర్‌కు చెందిన టీ కృష్ణ వ్యాజ్యంపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె శ్రీనివాసరావుతో కూడిన ధర్మాసనం ఇటీవల విచారణ జరిపింది.



## అమెరికా పర్యటనకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

**బలగం టీవీ, హైదరాబాద్**

రాష్ట్రానికి పెట్టుబడులు తేవడమే లక్ష్యంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనలో ఉన్న సంగతి తెలిసిందే. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సైతం అమెరికా పర్యటనకు వెళుతున్నారు. ఈ నెల 7న సీఎం రేవంత్ రెడ్డితో కలిసి ప్రవాస భారతీయ లీడర్లతో జరిగే మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. బేరింగ్ ఇతర రిపేర్లతో ఆలస్యం అవుతున్న ఎస్ఎల్బీసీ టన్నెల్ తవ్వకాన్ని వేగవంతం చేసేందుకు అధునాతన బేరింగ్ మెషినరీ సమకూర్చేందుకు మంత్రి కోమటిరెడ్డి అమెరికా వెళ్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే ఈ నెల 12న ఓహియోలోని రాబిన్స్ టన్నెల్ బోరింగ్ మెషినరీ మ్యాన్ ఫ్యాక్చరింగ్ కంపెనీ సీఈఓ లాక్ హెూమ్ తో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సమావేశం కానున్నట్లు తెలిసింది.

# హైదరాబాద్‌లో కాగ్నిజెంట్ భారీ విస్తరణ..

- న్యూజెర్సీ కార్యాలయంలో సీఈవోతో సీఎం రేవంత్ భేటీ
- తెలంగాణ స్టార్టప్‌లలో వాల్స్ కర్రా రూ.839 కోట్ల పెట్టుబడులు
- సీఎం సమక్షంలో ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్న సంస్థ
- మరో 15 వేల మందికి ఉద్యోగ అవకాశాలు



బలగం టీవీ, హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనలో తొలిరోజే ప్రముఖ అంతర్జాతీయ ఐటీ దిగ్గజ కంపెనీ కాగ్నిజెంట్ శుభవార్త అందించింది. నగరంలో భారీ విస్తరణ ప్రణాళికను ప్రకటించింది. హైదరాబాద్‌లో దాదాపు 15 వేల మంది ఉద్యోగులకు పని కల్పించేలా కొత్త క్యాంపస్ నెలకొల్పనున్నట్లు సోమవారం ప్రకటించింది. 20 వేల మంది ఉద్యోగులు పనిచేసే సామర్థ్యం కలిగి ఉండేలా 10 లక్షల చదరపు అడుగుల స్థలంలో దీనిని నెలకొల్పుతామని కాగ్నిజెంట్ సీఈవో రవికుమార్ ప్రకటించారు. 2002లో కేవలం 180 మంది ఉద్యోగులతో హైదరాబాద్‌లో తొలి కార్యాలయం

ప్రారంభించిన ఈ సంస్థ ప్రస్తుతం నగరంలో ఐదు కార్యాలయాలు, 18 వేల మంది ఉద్యోగులను కలిగి ఉంది. కొత్త సాంకేతిక పరిజ్ఞానంలో మరింత విస్తరించాలన్న కంపెనీ లక్ష్యానికి అనుగుణంగా హైదరాబాద్‌లో కొత్త క్యాంపస్ నెలకొల్పనున్నట్టు సీఈవో రవికుమార్ వెల్లడించారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, డిజిటల్ ఇంజనీరింగ్, క్లౌడ్ సొల్యూషన్స్‌తో సహా వివిధ అధునాతన సాంకేతికతలపై కొత్త కేంద్రం ప్రత్యేకంగా దృష్టి సారిస్తుందన్నారు. సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, ఉన్నతాధికారుల బృందం న్యూజెర్సీలోని కాగ్నిజెంట్ ప్రధాన కార్యాలయంలో సీఈవో రవికుమార్‌తో సమావేశమైంది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వంతో కంపెనీ పరస్పర అవగాహన ఒప్పందం (ఎంవోయు) కుదుర్చుకుంది.

ఐటీ రంగానికి మరింత అనుకూలమైన వాతావరణం కల్పించేందుకు తమ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని కాగ్నిజెంట్‌తో ఎంవోయూ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. కాగ్నిజెంట్ కంపెనీ కొత్త సెంటర్ ఏర్పాటుతో ప్రపంచ టెక్నాలజీ కంపెనీలన్నీ హైదరాబాద్‌ను తమ ప్రధాన గమ్యస్థానంగా ఎంచుకుంటాయని అభిప్రాయపడ్డారు. కంపెనీకి ప్రభుత్వపరంగా పూర్తి సహకారం అందిస్తామని, ఈ విస్తరణతో రాష్ట్రంలో వేలాది మంది యువతకు ఉద్యోగాలతో పాటు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై సానుకూల ప్రభావం ఉంటుందని తెలిపారు. హైదరాబాద్‌తో పాటు తెలంగాణలోని ద్వితీయ శ్రేణి నగరాలలో కూడా ఐటీ సేవలను విస్తరించాలని ముఖ్యమంత్రి చేసిన సూచనకు కంపెనీ ప్రతినిధులు సానుకూలత వ్యక్తం చేశారు. ఇప్పటికే ప్రముఖ టెక్ కంపెనీలన్నీ హైదరాబాద్ వైపు చూస్తున్నాయని, ఇక్కడ కొత్త కేంద్రాన్ని స్థాపించాలనే కాగ్నిజెంట్ నిర్ణయం హైదరాబాద్ వృద్ధికి మరింతగా దోహదపడుతుందని ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఆర్థిక శాఖ, ఐటీ, పరిశ్రమల శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు రామకృష్ణారావు, జయేశ్ రంజన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ముఖ్యమంత్రి నేతృత్వంలోని బృందం న్యూయార్క్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌ను సందర్శించింది.

ప్రవాస భారతీయులు తెలంగాణకు పెట్టుబడులతో రావాలని, పెట్టుబడులు వచ్చేందుకు సహకరించాలని, రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. పది రోజుల అమెరికా, దక్షిణ కొరియా పర్యటనకు వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి బృందం సోమవారం అమెరికా చేరుకున్నారు. న్యూజెర్సీలో ప్రవాస తెలంగాణ వాసులు నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి వేలాది మంది తరలివచ్చారు. అంతకుముందు దారి పొడవునా భారీ ర్యాలీతో రేవంత్‌రెడ్డి ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. "తెలంగాణ మీ జన్మభూమి, మీ దేశంలో మీరు పెట్టిన ప్రతి పెట్టుబడికీ తప్పకుండా ప్రయోజనం ఉంటుంది. అంతకు మించిన అత్యుత్తమ ప్రతిఫలం ఉంటుంది.

మన ప్రాంత అభివృద్ధిలో భాగస్వామ్యం పంచుకుంటే అంతకు మించిన సంతృప్తి బోనస్‌గా లభిస్తుంది. మీ నైపుణ్యాలు, ప్రతిభా పాటవాలతో అమెరికాను ప్రపంచంలోనే అగ్రరాజ్యంగా మార్చారు. అత్యంత పటిష్ట, సంపన్న దేశంగా అభివృద్ధి చెందడంలో మీ పాత్ర అత్యంత కీలకం. ఇప్పుడు సొంత రాష్ట్రానికి మీ అవసరం ఉంది. ఇక మీ ప్రతిభ, నైపుణ్యాలు తోడైతే హైదరాబాద్‌ను ప్రపంచంలోనే అగ్రగామి నగరంగా అభివృద్ధి చేయవచ్చు" అని రేవంత్ అన్నారు. గతేడాది టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో అమెరికాకు వచ్చానని, పదేండ్ల పాటు సాగిన దుష్పరిపాలనకు, విధ్వంసాలకు విముక్తి పలికి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే మళ్లీ వస్తానని చెప్పానని గుర్తు చేశారు. తాను ఇచ్చిన మాట నిలబెట్టుకున్నానని చెప్పారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని కూడా తమ ప్రభుత్వం నిలబెట్టుకుంటుందన్నారు.

భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని సమ్మిళిత ఆర్థిక వృద్ధిని వేగంగా సాధించే తమ ప్రభుత్వం కొత్త పారిశ్రామిక విధానాన్ని తీసుకువస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలు, వాగ్దానాలను నెరవేర్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న కృషిని ఎన్నారైలు అభినందించారు.

## తెలంగాణ స్కిల్ యూనివర్సిటీ చైర్మన్‌గా ఆనంద్ మహీంద్ర

- న్యూజెర్సీలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన

బలగం టీవీ, హైదరాబాద్

తెలంగాణ ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన స్కిల్ యూనివర్సిటీకి చైర్మన్‌గా ప్రముఖ పారిశ్రామికవేత్త, మహీంద్రా గ్రూప్ అధినేత ఆనంద్ మహీంద్ర వ్యవహరిస్తారని సీఎం రేవంత్ ప్రకటించారు. సోమవారం న్యూజెర్సీలో తెలంగాణ ప్రవాసుల సభలో ఈ విషయాన్ని ఆయన వెల్లడించారు. కొద్దిరోజుల్లో ఆనంద్ మహీంద్ర బాధ్యతలు స్వీకరిస్తారని తెలిపారు. తెలంగాణ యువతను ప్రపంచంలోనే ఉత్తమ నైపుణ్యం కలిగిన వారిగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంతో ఏర్పాటైన స్కిల్ యూనివర్సిటీకి అంతర్జాతీయంగా పేరున్న ప్రముఖుడినే చైర్మన్‌గా నియమిస్తామని సీఎం అసెంబ్లీలో ప్రకటించిన విషయం తెలిసిందే. కాగా, ఆనంద్ మహీంద్ర ఇటీవల హైదరాబాద్‌లో సీఎంని కలిసిన సందర్భంలోనూ స్కిల్ యూనివర్సిటీపై చర్చలు జరిపినట్టు తెలిసింది.

### పార్టీ మారిన
## ఎమ్మెల్యేల పైన అనర్హత వేటు తప్పదు

(మొదటి పేజీ తరువాయి)

చర్చలు జరిపింది. అటు రాజ్యాంగ నిపుణులతోనూ మంగళవారం పార్టీ ప్రతినిధి బృందం సమావేశమైంది. ఇప్పటికే పార్టీ ఫిరాయింపుల విషయంలో మణిపూర్‌కు సంబంధించిన ఎమ్మెల్యే సహా సుప్రీంకోర్టు పలు తీర్పులు ఇచ్చిందని రాజ్యాంగ నిపుణులు చెట్పట్ ఆర్యమా సుందరం పార్టీ బృందానికి తెలిపారు. గతంలో మాదిరిగా అనర్హత వేటు విషయంలో సుదీర్ఘ కాలం పాటు నిర్ణయం తీసుకోకుండా స్పీకర్ ఈ అంశాన్ని నాన్చలేరని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ముగ్గురు ఎమ్మెల్యేల అనర్హత వేటుకు సంబంధించి హైకోర్టులో వేసిన పిటిషన్‌తో పాటు, పార్టీ మారిన ఎమ్మెల్యేలపైన స్పీకర్‌కు చేసిన ఫిర్యాదు విషయాన్ని, వాటికి సంబంధించిన పత్రాలను న్యాయ నిపుణులకు బీఆర్ఎస్ నేతలు అందించారు. ఈ విషయంలో ప్రస్తుతం సుప్రీంకోర్టు మార్గదర్శకాలు స్పష్టంగా ఉన్నందున హైకోర్టు సైతం ఎక్కువ కాలం వాయిదా వేసే అవకాశం లేదని న్యాయ నిపుణులు తెలిపారు. హైకోర్టు నిర్ణయం త్వరగా ప్రకటించకుంటే సుప్రీంకోర్టుకు వెళ్లే అవకాశం ఉందన్నారు.

సుప్రీంకోర్టు తీర్పులతోపాటు న్యాయ కోవిదులు, రాజ్యాంగాన్ని నిపుణులు చెబుతున్న సలహాలు, సూచనల మేరకు న్యాయపోరాటం కొనసాగిస్తామని కేటీఆర్ తెలిపారు. త్వరలోనే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామన్నారు. హైకోర్టు లేదా సుప్రీంకోర్టు ద్వారా నెల రోజుల్లో పార్టీ మారిన ఎమ్మెల్యేలపైన అనర్హత వేటు అంశం తేలిపోతుందని కేటీఆర్ విశ్వాసం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఉప ఎన్నికలు తప్పవని పార్టీ మారిన ఎమ్మెల్యేలకు ప్రజాక్షేత్రంలోనే బుద్ధి చెప్తామన్నారు. ఒకవైపు జాతీయ స్థాయిలో పార్టీ ఫిరాయింపులపైన సుద్దపూస ముచ్చట్లు చెబుతూ తెలంగాణ రాష్ట్రంలో రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసేలా కాంగ్రెస్ పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తుందని కేటీఆర్ మండిపడ్డారు. త్వరలోనే కోర్టుల సహాయంతో కాంగ్రెస్‌కు సరైన గుణపాఠం చెబుతామన్నారు. రాజ్యాంగ నిపుణులు, న్యాయ కోవిదులతో జరిగిన సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు ఎమ్మెల్యేలు హరీష్ రావు, జగదీష్ రెడ్డి, గంగుల కమలాకర్, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర సహా పార్టీ నాయకులు పాల్గొన్నారు.

### నాగార్జునసాగర్
## 16 గేట్లు ఎత్తి నీరు విడుదల

(మొదటి పేజీ తరువాయి)

నాగార్జునసాగర్ ఎస్ఈ నాగేశ్వరరావు, సీఈ అనిల్ కుమార్ కృష్ణమ్మకు జలహారతి ఇచ్చి, ఆరు రేడియల్ క్రస్ట్ గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. అనంతరం మరో పది గేట్లను క్రమక్రమంగా ఎత్తారు. అంతకుముందు దిగువ ప్రాంతాల ప్రజల అప్రమత్తత కోసం మూడుసార్లు సైరన్‌ను మోగించారు. శ్రీశైలం నుంచి భారీగా వరద నీరు రావడంత సోమవారం గేట్లు ఓపెన్ చేశామని నాగార్జునసాగర్ ఎస్ఈ నాగేశ్వరరావు పేర్కొన్నారు. మొత్తం పదహారు క్రస్టు గేట్లు ద్వారా నీటిని దిగువకు విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. సుమారు 2 లక్షలకు పైగా క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసినట్లు నాగేశ్వరరావు స్పష్టం చేశారు. వరద నీరు ఫ్లో ఆధారంగా మరిన్ని గేట్లు ఓపెన్ చేస్తామన్నారు. సాగర్ గేట్లు తెరుచుకోవడంతో, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సుమారు 22 లక్షల ఆయకట్టు సాగులోకి వస్తోంది. సాగర్ సోయగాలు చూసేం దుకు పెద్ద సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. దీంతో ప్రాజెక్టు వద్ద సందడి నెలకొంది.

పోటెత్తుతున్న వరద : ప్రస్తుతం నాగార్జున సాగర్ జలాశయానికి శ్రీశైలం ప్రాజెక్టు నుంచి వరద ప్రవాహం కొనసాగుతోంది. ఇన్ ?ఫ్లో 3,23,969 క్యూసెక్కులు ఉండగా, 1,63,691 క్యూసెక్కుల ఔట్ ఫ్లో ఉంది. సాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 590.00 అడుగులు ఉండగా, ప్రస్తుత నీటి మట్టం 584.40 అడుగులకు చేరింది. 312.50 టీఎంసీల పూర్తి నీటి నిల్వ సామర్థ్యానికి ప్రస్తుత నీటి నిల్వ 294.70 టీఎంసీలు ఉంది. మొత్తం పదహారు గేట్లు ఎత్తి అధికారులు నీటిని విడుదల చేస్తున్నారు.

గత రెండేళ్ల నుంచి సాగర్ జలశయానికి వరద ప్రవాహం లేకపోవడంతో మేజర్ కాల్వలను అధికారులు నిర్లక్ష్యం చేశారు. దీంతో సాగర్ కుడి, ఎడమ కాల్వలు నుంచి మేజర్ కాల్వలకు వెళ్లే ప్రధాన కాల్వలు ప్రమాదకర స్థితిలో ఉన్నాయి. కొన్ని చోట్ల కాలువ కట్ట లైనింగ్ సరిగా లేదు. మరికొన్ని చోట్ల కాల్వ లైనింగ్ పనులు జరగకపోవడంతో పగుళ్ల ఏర్పడి రాళ్లు పైకి తేలి నిర్జీవంగా ఉంది. దీంతో పూర్తి సామర్థ్యం మేర నీటిని విడుదల చేయకుండా, కొద్ది కొద్దిగా మేజర్ కాల్వలకు నీటిని విడుదల చేస్తున్నారు.

కృష్ణా పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఎగువన కర్ణాటక రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలతో పెద్దఎత్తున వరద పోటెత్తుతోంది. శ్రీశైలం జలాశయానికి సుంకేశుల, జూరాల నుంచి వరద ప్రవాహం పెరగడంతో, 10 గేట్లను ఎత్తి నీటిని దిగువన ఉన్న నాగర్జునసాగర్?కు విడుదల చేస్తున్నారు. కృష్ణా పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మత్స్యకారులు చేపలు పట్టడానికి వెళ్లవద్దని, పశువులను నదిలోకి తీసుకెళ్లడం లాంటివి చేయవద్దని అధికారులు హెచ్చరించారు. ఇన్‌ఫ్లో ఆధారంగా మరిన్ని గేట్లు ఎత్తే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

# బలగం తీన్మార్







(మొదటి పేజీ తరువాయి)

తర్వాత చూసిన సినిమా బలగం. ఇప్పటికి 100 ఇంటర్నేషనల్ అవార్డులు సొంతం చేసుకున్న బలగం.. తాజాగా ప్రతిష్టాత్మక ఫిలింఫేర్ అవార్డులు మూడు సొంతం చేసుకుంది. ఉత్తమ చిత్రంగా బలగం, ఉత్తమ దర్శకుడిగా వేణు యెల్ధండి(బలగం), ఉత్తమ సహాయ నటిగా రూపలక్ష్మీ(బలగం) లు అవార్డులు అందుకున్నారు.

**వేణు యెల్ధండికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశంసలు**

బలగం సినిమాకు ఫిలింఫేర్ అవార్డు రావడం, ఉత్తమ చిత్రం బలగం, ఉత్తమ డైరక్టర్ గా వేణు యెల్ధండి ఎంపికై అవర్డులు అందుకోవడం పట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ తన ఎక్స్ ఖాతా ద్వారా అభినందనలు తెలిపారు. బలగం టీంకు శుభాకాంక్షలు తెలియజేవారు. తన నియోజకవర్గానికి చెందిన నే కార్మిక కుటుంబానికి చెందిన వేణు యల్ధండి కష్టపడి, అంచలంచలుగా ఎదిగి గొప్ప సినిమా బలగం తీసినందుకు కేటీఆర్ అభినందనలు తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఈ సినిమా తీసిన విషయాన్ని గుర్తు చేశారు. వేణుతో పాటు అతని టీం కష్టానికి దక్కిన ఫలితంగా అభివర్ణించారు.

**వేణు'బలగం' కు కేటీఆర్ మొదటి నుంచి అండ**

బలగం సినిమా ఎక్కడ తీయడం ఎందుకు రాజన్న సిరిసిల్ల జిల్లాలో కూడా అద్భుతమైన లోకేషన్లు ఉన్నాయి తీయండి అన్ని విధాల సహకరిస్తామని కేటీఆర్ చెప్పారు. టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్ కు ఈ సినిమా ప్రొడ్యూసర్ దిల్ రాజు కూడా సన్నిహితుడు కావడంతో సిరిసిల్ల లో ఈ సినిమా మొత్తం షఉట్ చేశారు. ఈ సినిమాతో రాజన్న సిరిసిల్ల జిల్లా లోని లోకేషన్లు రాష్ట్ర వ్యాప్తంగా చర్చకు వచ్చాయి. కోనసిమాను తలపించే పచ్చన పోలాలు మెట్ట ప్రాంతమైన సిరిసిల్ల లో కూడా ఉన్నాయా.. అని ప్రేక్షకులు రాజన్న సిరిసిల్ల అభివృద్ధి పై, కాళేశ్వరం జలాలపై మీద కూడా చర్చ జరిగింది. సిరిసిల్ల లోనే బలగం సినిమా ప్రీ రీలిజ్ ఈవెంట్ ఏర్పాటు చేసుకోవాలని కేటీఆర్ సూచించడంతో బలగం సినిమా ప్రొడ్యూసర్లు సిరిసిల్ల లోనే ఈ ఈవెంట్ ఏర్పాటు చేశారు. ఒక సినిమా ఫంక్షన్ మొదటి సారి చిన్న జిల్లా కేంద్రంలో నిర్వహించడం సిని చరిత్రలో కూడా మొదటి సారి. కేటీఆర్ మంత్రిగా ఉన్న సమయంలో ఈ సినిమాకు ప్రీ రీలిజ్ ఈవెంట్‌కు వేణు యెల్ధండి కోసం సమయం కేటాయించి మూడున్నర గంటలు ఈ ఫంక్షన్ లో పాల్గొన్నారు. మంచి సినిమాలకు, తెలంగాణా ఆత్మను ప్రతిబంభించే సినిమాలకు తమ మద్దతు ఎప్పుడు ఉంటుందని, సిరిసిల్ల నా నియోజకవర్గం, వేణు మా సిరిసిల్ల బిడ్డ నా తమ్ముడు వేణు తీసిన సినిమా విజయవంతం కావాలని మనస్పూర్తిగా కోరుకుంటున్నట్లు



కేటీఆర్ వేదికపై ప్రకటించారు. ప్రకటించన విధంగాన ఈ సినిమా ప్రమోషన్ కూడా కేటీఆర్ చేశారు. అసెంబ్లీ సాక్షిగా ఈ సినిమా గురించి చర్చించారు. కాళేశ్వరం జలాలతో మెట్ట ప్రాంతమైన సిరిసిల్ల కూడా పచ్చని పోలాలు.. కొనసీమ లెక్క అయ్యిందని దీనికి నిదర్శనం ఈ మధ్య తీసిన బలగం సినిమాలోని సన్నివేశాలే ఉదాహరణ అని ప్రకటించారు.బలగం సినిమాకు అన్ని కలిసివచ్చాయి. జనం మెచ్చిన సినిమా, పల్లె ప్రజల హృదయాలను దోచిన సినిమాగా ఈ రోజు గుర్తింపు పొంది వేణు యెల్ధండి పేరు సినిమా చరిత్ర నిలిచిపోయేలా చేసింది. బలగం సినిమా కథకు, తెలంగాణా కల్చర్‌కు ఉన్న గొప్పతనంగా చాలా అభివర్ణిస్తున్నారు.





### మొక్కలు నాటే కార్యక్రమాన్ని
## ఒక యజ్ఞంలా చేయాలి..





- వేములవాడ అభివృద్ధిలో ఎక్కడా రాజీపడేదిలేదు..
- రానున్న రోజుల్లో అన్ని హామీలను అమలు చేస్తాం..
- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

బలగం టీవీ , వేములవాడ :

స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఒక యజ్ఞం లా చేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. సోమవారం వేములవాడ పట్టణంలోని సినారె కళామంది రంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛదనం పచ్చదనం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే అది శ్రీనివాస్ పాల్గొన్నారు.అనంతరం తెలంగాణ చౌక్ నుండి బద్ది పోచమ్మ దేవాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ మాధవి తో కలిసి రోడ్లు ను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శుభ్రం చేశారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస మాట్లాడుతూ స్వచ్ఛదనం పచ్చదనం రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభిస్తున్న నేపథ్యంలో వేములవాడ పట్టణంలో ప్రారంభించుకోవడం సంతోషకరమని అన్నారు.ప్రజల తమ జీవన ప్రమాణాలను పెంపొందించుకునేందుకు, ప్రతి ఒక్కరు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యమని,వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ, మన చుట్టుపక్కల పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు.చెట్లను పెంచడం వలన స్వచ్ఛమైన ఆక్సిజన్ లభించి,మన జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని అన్నారు. గ్రామాల్లో అడవులు అంతరించిపోతున్నాయని, పట్టణంలో చెట్లు పెంచని యెడలవాతావరణం లో కార్బన్డయాక్సైడ్ స్థాయి పెరిగే, ప్రజల ఆరోగ్యం దెబ్బ తినే ప్రమాదం ఉన్నదని,కావున ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని,ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకొని అందరూ భాగస్వామ్యం కావాలని అన్నారు. వచ్చాం వెళ్ళాం అని కాకుండా ప్రభుత్వం తీసుకున్న కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ కంకణ బద్ధులై కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళ్లాలని, మనం నాటిన చెట్లను కాపాడుకోవాలని దీని ద్వారా భవిష్యత్ తరాలకు మేలు చేసిన వారం అవుతామని అన్నారు.

గతంలో గ్రామాల్లో అందరూ కలసి ఏ కార్యక్రమమైనా ఒక పండగ వాతావరణంలా జరుగుకునేదని, కానీ నేడు ప్రతి కార్యక్రమంలో కొందరే భాగస్వాములు అవుతున్నారని అన్నారు.

మనం చేపట్టిన ఏ ప్రభుత్వ కార్యక్రమంలో అయినా ప్రజలను భాగస్వామ్యం చెయ్యాలని అన్నారు. పట్టణంలో ఒక వైపు పెద్ద చెట్లు, కరెంటు తీగలున్నవైపు పుల చెట్లు నాటాలని,తద్వారా పట్టణం, ప్రతి వార్డులులోఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడుతుంది అని అన్నారు.

9 తేదీ వరకు ప్రతి వార్డులో అధికారులు స్పెషల్ డ్రైవ్ తీసుకొని మొక్కలు నాటాలని,నాటిన మొక్కలకు టి గార్డ్ ఏర్పాటు చెయ్యాలని అన్నారు.

పట్టణం పరిశుభ్రంగా ఉంటే,ప్రజలు అందరు ఆరోగ్యంగా ఉంటారు అని,టెంపుల్ సిటీ అభివృద్ధిలో అందరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. వేములవాడ పట్టణ అభివృద్ధి లో ఎక్కడ రాజీపడేదిలేదు అని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ రానున్న రోజుల్లో అమలు చేస్తామని అన్నారు. రైతులకు ఏక కాలంలో రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వం కే దక్కుతుందని అన్నారు.

రాజన్న ఆలయ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, ఇప్పటికే బడ్జెట్లో 50 కోట్లు కేటాయించడం జరిగింది అని,సుదూరం నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా బ్రేక్ దర్శనం అమలు చేస్తున్నామని అన్నారు. రాజకీయలకు అతీతంగా మన ప్రాంతంన్నీ అభివృద్ధి చేసుకుందాం చేసుకుందామని, పాలకుడిగా కాకుండా మీ సేవకుడిగా ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# టీ20 వరల్డ్ కప్‌పై నీలి నీడలు




**బంగ్లాదేశ్‌లో చెలరేగుతున్న హింసతో మహిళల టీ20 వరల్డ్‌కప్ తరలిపోయే అవకాశం**

**బలగం టీవి, న్యూఢిల్లీ**

బంగ్లాదేశ్‌లో చెలరేగుతున్న హింస ప్రభావం క్రికెట్‌పై పడనుంది. ఆ దేశ ప్రధాని షేక్ హసీనా రాజీనామాతో సైన్యం దేశాన్ని గుప్పిట్లోకి తీసుకుంది. ఈ నేపథ్యంలో బంగ్లాదేశ్‌లో మరో రెండు నెలల్లో జరగాల్సిన మహిళల టీ20 వరల్డ్ కప్ పై నీలి నీడలు కమ్ముకున్నాయి.ప్రస్తుతం అబంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు(బీసీబీ)తో కలిసి అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ అక్కడి ఉద్రిక్త పరిస్థితులను నిశితంగా గమనిస్తోంది. ఒకవేళ హింసాత్మక ఘటనలు ఇంకొన్ని రోజులు కొనసాగితే బంగ్లా నుంచి వరల్డ్ కప్ వేదికను తరలించే అవశాశముంది.

బీసీబీ భద్రతాధికారులతో పాటు తమ స్వతంత్ర సిబ్బంది సైతం పరిస్థితిని ఆరా తీస్తోందని.. మెగా టోర్నీలో పాల్గొనే క్రికెటర్ల భద్రతే తమ ప్రధాన ఉద్దేశం అని ఐసీసీ ఓ ప్రకటనలో తెలిపింది. షెడ్యూల్ ప్రకారం మహిళల టీ20 వరల్డ్ కప్ తొమ్మిదో సీజన్ బంగ్లాదేశ్‌లో అక్టోబర్ 3న ప్రారంభం కావాలి. ఒకవేళ బంగ్లాలో ఈ మెగా నిర్వహించడం సాధ్యంకాని పక్షంలో ఐసీసీ కొత్త వేదికను ప్రతించనుంది.

# ముగిసిన లక్ష్యసేన్ పోరాటం



**బలగం టీవి, పారీస్**

పారిస్ ఒలింపిక్స్‌లో భారత స్టార్ బ్యాడ్మింటన్ ప్లేయర్ లక్ష్యసేన్ పోరాటం ముగిసింది. కాంస్య పతక పోరులో లక్ష్యసేన్ మలేషియాకు చెందిన జెడ్ జే లీ చేతిలో 21-13, 16-21, 11-21 తేడాతో ఓడిపోయాడు. ఈ పోరులో తొలి గేమ్ అలవోకగా నెగ్గిన సేన్ రెండు, మూడు గేమ్‌లలో మాత్రం చేతుల ెత్తేశాడు. కాగా, కుడి మోచేయికి గాయం వేధిస్తు న్నా ఈ పోరులో గెలుపు కోసం పోరాడాడు లక్ష్యసేన్. దీంతో ఈ మ్యాచ్‌లో భారత్‌కు పతకం రాకపోయినప్పటికీ లక్ష్యసేన్ పోరాటం ఆకట్టు కుంది. వాస్తవానికి తొలి సెట్‌లో ప్రారంభం నుంచి దూకుడుగా ఆడిన లక్ష్యసేన్ రెండో సెట్‌లో కాస్త డీలాపడ్డాడు. అదే సమయంలో పుంజుకున్న లీ జిజియా రెండో సెట్‌ను సొంతం చేసుకున్నాడు.

# సెమీస్‌కు ముందు భారత జట్టుకు షాక్

- **డిఫెండర్ రోహిదాస్‌పై ఒక మ్యాచ్ నిషేధం**

**బలగం టీవి, న్యూఢిల్లీ**

సెమీస్‌కు ముందు భారత హాకీ జట్టుకు ఎదురుదెబ్బ తగిలింది. డిఫెండర్ రోహిదాస్ ఒక మ్యాచ్ నిషేధానికి గుర్రైయ్యాడు. ఆదివారం గ్రేట్ బ్రిటన్‌తో జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో మెన్ ఇన్ బ్లూ సంచలన విజయం సాధించిన విషయం తెలిసిందే. అయితే ఈ మ్యాచ్‌లో రోహిత్‌దాస్ హాకీ ఫెడరేషన్ ప్రవర్తన నియమావళి ఉల్లంఘించాడని ఇంటర్నేషనల్ హాకీ ఫెడరేషన్ వెల్లడించింది. దీంతో అతడిని ఒక మ్యాచ్ సస్పెండ్ చేస్తున్నట్లు ఎఫ్ఐహెచ్ ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఒలింపిక్స్‌లో మంగళవారం జర్మనీతో జరుగనున్న సెమీఫైనల్ మ్యాచ్‌కు దూరం కానున్నాడు. దీనికి సంబంధించి పారిస్ ఒలింపిక్స్ కూడా ఒక ప్రకటన విడుదల చేసింది.

ఆదివారం నాటి మ్యాచ్ రెండో క్వార్టర్ మొదలైన రెండు నిమిషాలకే భారత డిఫెండర్ అమిత్ రోహిదాస్‌కు రిఫరీ రెడ్ కార్డ్ చూపించాడు. ప్రత్యర్థి జట్టు ఆటగాడైన విలియమ్ కల్నల్ తలపై ఉద్దేశపూర్వకంగా కొట్టాడని ఆరోపిస్తూ రిఫరీలు అతడిని బయటకు పంపించాడు. దీంతో హర్మన్‌ప్రీత్ సేన మిగిలిన మ్యాచ్‌ను 10 మందితోనే ఆడింది. కీలక ఆటగాడు ఫీల్డ్‌లో లేకున్నా భారత్ నిరాశచెందలేదు. మూడో క్వార్టర్‌లో సుమిత్ కూడా గ్రీన్ కార్డ్ కారణంగా కొంతసేపు మైదానాన్ని వీడటం గమనార్హం. 22వ నిమిషంలో హర్మన్‌ప్రీత్ పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలచడంతో భారత్ బోణీ కొట్టింది. అయితే రెండో క్వార్టర్



ముగియకుమందే 27వ నిమిషంలో లీ మోర్టన్ గోల్‌తో స్కోర్లు 1-1తో సమం అయ్యాయి. తర్వాత రెండు క్వార్టర్స్‌లోనూ ఇరు జట్లూ గోల్ చేయలేకపోయాయి. దీంతో మ్యాచ్ షూటౌట్‌కు వెళ్లింది.

షఉటౌట్‌లో బ్రిటన్ తరపున అల్బరి జేమ్స్, వాలేస్ జాక్ రెండు గోల్స్ కొట్టారు. భారత్ నుంచి హర్మన్‌ప్రీత్, సుఖ్‌జీత్ గోల్స్ చేసి స్కోర్లను సమం చేశారు. మూడో గోల్ కోసం వచ్చిన విలియమ్సన్ కానర్ ప్రయత్నాన్ని శ్రీజేష్ అడ్డుకోవడంతో ఆ జట్టులో టెన్షన్ మొదలైంది. లలిత్ ఉపాధ్యాయ మూడో గోల్ చేసి భారత్‌ను 3-2తో ఆధిక్యంలోకి తెచ్చాడు. బ్రిటన్‌కు చివరి అవకాశంగా వచ్చిన రోపర్ ఫిలిప్ సైతం గోల్ చేయడంలో విఫలమయ్యాడు. కానీ రాజ్‌కుమార్ పాల్ బంతిని గోల్ పోస్ట్‌లోకి పంపి భారత్‌కు తిరుగులేని విజయాన్ని అందించాడు.

# స్టీపుల్ చేజ్ ఈవెంట్‌లో ఫైనల్స్‌కు భారత్




**బలగం టీవి, పారీస్**

పారిస్ ఒలంపిక్స్ పురుషుల స్టీపుల్ చేజ్ ఈవెంట్‌లో భారత్ ఫైనల్స్ కు చేరింది. నేడు జరిగిన 3000 మీటర్ల స్టీపుల్ చేజ్ భారత్ కు చెందిన అవినాష్ సేబుల్ ఫైనల్‌కు చేరాడు. స్టీపుల్‌చేజ్ హీట్ 2లో ఉన్న అవినాష్ 8:15.43 సెకన్ల టైమింగ్‌తో ఐదవ స్థానంలో నిలిచి ఫైనల్స్ కు అర్హత సాధించాడు. కాగా, పురుషుల స్టీపుల్‌చేజ్ హీట్స్‌లో మొత్తం 36 మంది పోటీదారులు పాల్గొనగా 12 మంది అథ్లెట్లతో మూడు గ్రూపులుగా విభజించారు. కాగా, ఒక్కో హీట్‌లో మొదటి ఐదు స్థానాల్లో నిలిచిన వారు ఫైనల్‌కు చేరుకుంటారు. ఇక 3000 మీటర్ల పురుషుల స్టీపుల్‌చేజ్ ఫైనల్స్ ఆగస్ట్ 8 న జరగనుంది. కాగా, 2022 హాంగ్‌జౌ ఆసియా క్రీడల్లో పురుషుల 3000 మీటర్ల స్టీపుల్‌చేజ్ ఈవెంట్‌లో అవినాష్ స్వర్ణం సాధించాడు. అదేవిధంగా రేసును 8:19.53 సెకన్లలో పూర్తి చేసి సరికొత్త ఆసియా రికార్డును నెలకొల్పాడు.




## కళింగ టీజర్ విడుదల

**బలగం టీవి, హైదరాబాద్**

పాన్ ఇండియా ప్రాజెక్టు కళింగ టీజర్ విడుదలైంది. కిరోసిన్ ఫేం ధ్రువ వాయు. స్వీయదర్శకత్వంలో లీడ్ రోల్‌లో నటిస్తున్న కళింగ టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్‌లో చేతిలో కాగడ పట్టుకొని ఉండగా.. బ్యాక్ డ్రాప్‌లో లక్ష్మినరసింహస్వామి ఉగ్రరూపంలో కనిపిస్తున్నాడు. తాజాగా కళింగ టీజర్‌ను బాలీవుడ్ స్టార్ యాక్టర్ జాకీ ష్రాఫ్ లాంచ్ చేశాడు. ఓ బాలిక ఒళ్లు గగుర్పొచేలా తన చెవిని తానే కొరుక్కుని తినే సన్నివేశంతో షురూ అయింది టీజర్. యాక్షన్, సస్పెన్స్ థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో.. సంస్థానం అనేది పద్మవ్యూహం.. అక్కడికి పోవడమే కానీ రావడం ఉండదంటూ వచ్చే సంభాషణలతో కట్ చేసిన టీజర్ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతోంది.ఈ మూవీలో ప్రగ్యా నయన్ హీరోయిన్‌గా నటిస్తోంది. మురళీ ధర్ గౌడ్, లక్ష్మణ్ మీసాల, తనికెళ్లభరణి, బలగం సుధాకర్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి విష్ణు శేఖర, అనంత నారాయణన్ ఏజీ మ్యూజిక్ అందిస్తున్నారు. ఈ చిత్రాన్ని బిగ్ హిట్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై దీప్తి కొండవీటి, పృథ్వీయాదవ్ తెరకెక్కిస్తున్నారు.



## 'దేవర' పాట విడుదల

**బలగం టీవి, హైదరాబాద్**

'దేవర' సెకండ్ సింగిల్ సాంగ్ 'చుట్టమల్లె' అనే లిరికల్ వీడియో సాంగ్ విడుదలైంది. మ్యాన్ ఆఫ్ మాస్ జూ.ఎన్టీఆర్, బాలీవుడ్ అందాల భామ జాన్వీ కపూర్ ఈ పాటతో పూర్తిగా రొమాంటిక్ మూడ్ లోకి తీసుకెళ్లారు. లిరికల్ వీడియో చూస్తుంటే ఈ పాటలో ఎన్టీఆర్, జాన్వీ కపూర్ ల కెమిస్ట్రీ నెక్స్ట్ లెవెల్ లో ఉండబోతోందని అర్థమవుతోంది.రామజోగయ్య శాస్త్రి అందమైన సాహిత్యానికి అనిరుధ్ రవిచందర్ మెస్మరైజింగ్ మ్యూజిక్ అందించగా ఈ పాటను సింగర్ శిల్పారావు అద్భుతంగా ఆలపించారు. ఇక డైరెక్టర్ కొరటాల శివ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 27న ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

# క్వార్టర్ ఫైనల్‌లో భారత మహిళా రెజ్లర్ ఓటమి





**బలగం టీవి, పారీస్**

పారిస్ ఒలింపిక్స్‌లో భారత మహిళా రెజ్లర్ నిశా దహియాకు ఫ్రిస్టైల్ 68 కేజీల క్వార్టర్ ఫైనల్స్‌లో నిరాశ ఎదురైంది. 8-10 తేడాతో సోల్ గమ్ (ఉత్తర కొరియా)పై ఓడింది. బౌట్ ప్రారంభం నుంచి దూకుడు చూపించిన నిశా తొలి రౌండ్‌లో ఆధిక్యంలో నిలిచింది. రెండో రౌండ్‌లో ఆరంభంలోనూ ఈజీగానే విజయం సాధించేలా కనిపించింది. కానీ, ఆ తర్వాత అనూహ్యంగా తీవ్రంగా గాయపడింది. మెడికల్ టీమ్ వచ్చి చికిత్స అందించినా ఫలితం దక్కలేదు. నొప్పితో విలవిల్లాడి కన్నీటి పర్యంతమైంది. అయినా కూడా బౌట్‌ను కొనసాగించింది. కానీ, చివరికి కనీస పోటీ కూడా ఇవ్వలేని స్థితిలోకి వెళ్లిపోయింది. దీంతో ప్రత్యర్థి విజేతగా నిలిచింది. అంతకుముందు ప్రిక్వార్టర్స్‌లో నిశా 6-4తో టెటియానా సోవా రిజ్కో (ఉక్రెయిన్)పై గెలుపొందింది. మొదట 1-4తో వెనుకబడినా ఆ తర్వాత గొప్పగా పుంజుకుని అద్భుతమైన విజయాన్ని సాధించింది.